# నమస్తే తెలంగాణ

## నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, సోమవారం 22 జూలై 2024 | NAGARKURNOOL


పెబ్బేరు పట్టణంలో మన గుడి-మన బాధ్యత పేరుతో భక్తులు చేపట్టిన వినూత్న కార్యక్రమం ఆకట్టుకుంటోంది. ప్రతివారం ఒక ఆలయాన్ని శుభ్రం చేయడమే లక్ష్యంగా స్థానికులు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం హైస్కూల్ పక్కనున్న ఆంజనేయస్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. సుమారు వందమంది పాల్గొని ఆలయ పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని ఎత్తి, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే గర్భ గుడిని సంప్రోక్షణ చేశారు.

*- పెబ్బేరు, జూలై 21*



## 265లో 15 మందికే రుణమాఫీ

వంగూరు, జూలై 21 : అర్హులైన చాలా మంది రైతులకు రుణమాఫీ అందడం లేదు. రూ.లక్ష వరకు బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు అందరికీ లిస్టులో పేరు లేకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన కట్ ఆఫ్ డేట్ ప్రకారం డిసెంబర్ 9,2023 ముందు, తర్వాత ఎంతో మంది రైతులు తమ రుణాలను బ్యాంకర్ల ఒత్తిడి మేరకు రెన్యువల్ చేసినా వారికి రుణమాఫీ కాకపోవడంతో వారు వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది రైతులకు ఆధార్ మిస్ మ్యాచ్ కావడంతోవారు రుణమాఫీకి అర్హత కాలేకపోయారు. మండలంలోని రంగాపూర్ సింగిల్‌విండో ద్వారా రూ.లక్ష లోపు రుణాలను పొందిన 265 మంది రైతులు ఉంటే వారిలో కేవలం 15 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించినట్లు సింగిల్ విండో సీఈవో విష్ణుమూర్తి తెలిపారు. ఇంతవరకు రుణమాఫీ వచ్చిన ఒక్క రైతు ఖాతాలో కూడా రుణమాఫీ డబ్బులు జమ కాకపోవడం కొసమెరుపు.

# కృష్ణమ్మ పరవళ్లు




- జూరాలకు లక్ష క్యూసెక్కులకు పైగా వరద
- 22 గేట్ల ఎత్తి దిగువకు నీటి విడుదల
- ప్రాజెక్టుకు పెరిగిన సందర్శకుల తాకిడి
- టీబీడ్యాంకు 1,25,911 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 79.969 టీఎంసీల నీటి నిల్వ

గద్వాల, జూలై 21 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వరద నీరు జూరాల ప్రాజెక్టుకు వచ్చి చేరుతుండడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ప్రాజెక్టు అధికారులు జూరాల వద్ద 22 గేట్లు ఎత్తి 84,524 క్యూసెక్కులను దిగువన ఉన్న శ్రీశైలం రిజర్వాయర్‌కు వదులుతున్నారు. దీంతో మొన్నటివరకు బీచుపల్లి వద్ద నీరులేక వెలవెలబోయిన కృష్ణమ్మ నేడు నిండుగా ప్రవహిస్తున్నది. కృష్ణమ్మ పరవళ్లు తిలకించేందుకు ఆదివారం సందర్శకులు జూరాల, బీచుపల్లి వద్దకు భారీగా తరలివచ్చారు. ఆదివారం రాత్రి 9 గంటలకు జూరాలలో 1,29,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. అవుట్‌ఫ్లో 1,19,280 క్యూసెక్కులుగా నమోదైంది. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 317.100 మీటర్లుగా ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.914 టీఎంసీలుగా ఉన్నది. ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ 11 యూనిట్లలో ఉత్పత్తి కొనసాగుతున్నది. అదేవిధంగా జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తికి 30,148, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 1,500, భీమా లిఫ్ట్-1కు 1,300, భీమా లిఫ్ట్-2కు 750, జూరాల ఎడమ కాల్వకు 870, కుడి కాల్వకు 596, సమాంతర కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, నారాయణపూర్ డ్యాం వద్ద 25 గేట్లు ఎత్తి దిగువకు 1,45,750 క్యూసెక్కులు విడుదల చేశారు.




## ర్యాలంపాడులో 1.30 టీఎంసీలు

- 1,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కుడి, ఎడమ కాల్వకు కొనసాగుతున్న ప్రవాహం

గట్టు, జూలై 21 : నెట్టంపాడు పథకంలో భాగమైన ర్యాలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఆదివారం నాటికి 1.30 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,200 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా ఉంది. ఎడమ కాల్వకు 97 క్యూసెక్కులు, కుడి కాల్వకు 398 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ర్యాలంపాడు రిజర్వాయర్ నీటి సామర్థ్యం 4 టీఎంసీలు ఉండగా కట్ట బలహీనంగా ఉండడంతో మొత్తంగా 2 టీఎంసీల నీటి నిల్వను మాత్రమే ఉంచనున్నారు. రిజర్వాయర్‌కు నీటిని వదులుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా (నారు) తుకం వేసుకున్న రైతులు తమ పొలాల్లో నాట్లు వేసుకోవడానికి సమాయత్తమవుతున్నారు. మరికొందరు మాత్రం నారు ఎదుగుదల కోసం ఎదురుచూస్తున్నారు. మొత్తమ్మీద నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆనందంగా ఉన్నారు.



పవర్‌హౌస్ నుంచి నదిలోకి వస్తున్న నీరు

## నిర్విరామంగా విద్యుదుత్పత్తి

- జూరాలలో 11.919 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

ఆత్మకూరు, జూలై 21 : ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిర్విరామంగా కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాల రిజర్వాయర్‌కు వరద తాకిడి ప్రారంభమైంది. దీంతో నాలుగురోజులుగా ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎగువ జూరాలలో 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి నిర్వహించగా శనివారం అర్ధరాత్రి నాటికి 3.9920 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేయగా ఇప్పటివరకు 9.80 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. దిగువ జూరాలలో మొత్తం 6 యూనిట్లలో విద్యుదుత్పత్తి నిర్వహిస్తుండగా శనివారం అర్ధరాత్రికి 4.637 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేయగా ఇప్పటివరకు 11.919 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. వరద ఉధృత్తి స్థిరంగా కొనసాగుతున్న పరిస్థితుల్లో విద్యుదుత్పత్తి స్థిరంగా కొనసాగుతున్నది.

## తుంగభద్రకు పోటెత్తిన వరద



తుంగభద్ర నదిలోకి చేరుతున్న వరద

అయిజ, జూలై 21 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాం నీటి మట్టం అంతకంతకూ పెరుగుతున్నది. తుంగనది పరీవాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో టీబీ డ్యాంకు వరద పోటెత్తుతున్నది. ఆదివారం ఇన్‌ఫ్లో 1,25,911 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 4,755 క్యూసెక్కులుగా నమోదైంది. టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1626.05 అడుగుల నీటి మట్టం ఉన్నది. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ 105.788 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 79.969 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువ నుంచి వరద పెరుగుతుండడంతో ఏపీ, కర్ణాటక కాల్వలకు నీటిని విడుదల చేశారు. అలాగే భారీ వరదల నేపథ్యంలో ఎల్ఎల్సీ కాల్వ ద్వారా తుంగభద్ర నదిలోకి 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. వరద నీటి చేరికతో నేడో రేపో నీటి విడుదలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## కోయిల్‌సాగర్ @ 17.5 ఫీట్లు

- అలుగుపారుతున్న బండర్‌వల్లి చెక్‌డ్యాం

దేవరకద్ర, జూలై 21 : జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు అయిన కోయిల్‌సాగర్‌లో రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతున్నది. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద చేరుతుండడంతో ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 17.5 ఫీట్లకు చేరిందని అధికారులు తెలిపారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.5 ఫీట్లు, మరో 15 ఫీట్ల మేర ప్రాజెక్టులోకి నీరు వస్తే గేట్లు తెరిచే అవకాశం ఉన్నది. అదేవిధంగా గూరకొండ-బండర్‌పల్లి మధ్యనున్న ఊకచెట్టు వాగులో నిర్మించిన చెక్‌డ్యాం నిండి అలుగు పారుతుండడంతో సందర్శకులను ఆకట్టుకుంటున్నది.




బండర్‌పల్లి చెక్‌డ్యాం వద్ద ప్రవహిస్తున్న నీరు

## సంగమేశ్వరం వద్ద జలసవ్వడి

కొల్లాపూర్, జూలై 21 : కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద సప్తనదుల సంగమమైన సంగమేశ్వరం వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. తుంగభద్ర, కృష్ణానదికి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో ఆదివారం కృష్ణానది జలాలు లలితాసోమేశ్వర ఆలయం సమీపానికి చేరాయి. అయితే సంగమేశ్వర ఆలయం జలమయం కానుండడంతో ఆరు నెలల వరకు పునః దర్శనం ఉండదు. ఈ మేరకు శనివారం సాయంత్రం సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణానదిలో వరద ఉధృతంగా ఉండడంతో నదీతీర ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.



సంగమేశ్వర ఆలయం వద్ద నీటి మట్టం



జీరో బిల్లు దరఖాస్తులను సమర్పించేందుకు వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో బారులుదీరిన జనం (ఫైల్)

*"వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్.. ప్రజాపాలనలో జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, అతడికి రెండు నెలలుగా జీరో బిల్లు రావడం లేదు. దీనిపై మండల పరిషత్ కార్యాలయానికి నాలుగు దఫాలు తిరిగాడు. చివరకు విద్యుత్ ఏఈని ఫోన్‌లో సంప్రదిస్తే.. లైన్‌మెన్‌ను అడగమన్నాడు. లైన్‌మెన్‌ను అడిగితే మండల పరిషత్‌కు వెళ్లమన్నాడు. మండల పరిషత్‌కు వెళ్తే కరెంట్ వాళ్ల దగ్గరికే వెళ్లమంటున్నారంటూ వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇలా జీరో బిల్లు అమలు కోసం అక్కడి నుంచి ఇక్కడికి.. ఇక్కడి నుంచి అక్కడికి తిప్పుతున్నారు తప్పా పనిమాత్రం చేయడం లేదని వాపోతున్నాడు."*



# గృహజ్యోతి తంటాలు

- చెప్పులరిగేలా తిరిగినా దక్కని ఫలితం
- సగం మందికే 'జీరో బిల్లు'
- దరఖాస్తులు సమర్పించేందుకు బారులు
- ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్న అధికారులు
- లబ్ధిదారుల పరేషాన్..
- వనపర్తి జిల్లాలో 57 వేల కనెక్షన్లు పెండింగ్

వనపర్తి, జూలై 21 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో గృహజ్యోతి పథకం అమలు దాగుడు మూతలు ఆడుతున్నట్లుగా కనిపిస్తుంది. అర్హులైన నిరుపేదలకు అల్లంత దూరంగా ఉంటూ ప్రభుత్వ ఉద్దేశాన్ని నీరుగార్చుతున్నది. ఇందుకు వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నప్పటికీ రెండు నెలలుగా ఆ పథకాన్ని అందుకోలేకపోవడమే నిదర్శనం. జిల్లాలో అనేక మందికి అర్హత ఉన్నా .. ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై అలసత్వంతో గృహజ్యోతి పథకం రాయితీ పొందలేకపోతున్నారు. జిల్లాలో కేటగిరీ-1లో ఉన్న ఇంటి విద్యుత్ కనెక్షన్లు మొత్తం 1,26,693 ఉన్నాయి. వీటిలో కేవలం 69,606 గృహ కనెక్షన్లకు మాత్రమే గృహజ్యోతి అమలవుతున్నది. మిగిలిన 57,087 కనెక్షన్లకు పైగా జీరో బిల్లులకు నోచుకోవడం లేదు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభల్లో అర్హత ఉన్న ప్రజలంతా జీరో బిల్లుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల్లో వివరాలు సరిగా రాయకపోవడం, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే సందర్భంలో కొన్ని తప్పులుండడంతో అర్హత ఉన్న వారు సైతం ఈ పథకానికి దూరమయ్యారు. తప్పులు సవరించుకునేందుకు మున్సిపాలిటీతోపాటు మండల కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి కొన్నింటిని సవరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నం పకడ్బందీగా కొనసాగకపోవడంతో వేలాది మంది నిరుపేదలు పథకాన్ని అందుకోలేకపోతున్నారు.

***దరఖాస్తుల్లోనే తప్పులు..***

దరఖాస్తు చేసినప్పుడు నమోదైన వివరాల్లో చిన్నచిన్న తప్పులతోనే సమస్య వస్తున్నది. మీటరు సంఖ్య తప్పుగా నమోదు చేయడం, ఒకరి పేరున మీటరు, మరొకరి పేరున రేషన్‌కార్డు, మృతి చెందిన వారి పేరున మీటర్లు ఉండడం, వారికి సంబంధించిన ఆధార్‌కార్డు లేకపోవడం, ఉన్నా అనుసంధానం చేసుకోకపోవడం వంటి అనేక సమస్యలు ఉండడంతో జీరో బిల్లులు రావడం లేదని తెలుస్తున్నది. ఈ తప్పులను గుర్తించే మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి సరిచేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు గృహజ్యోతి పథకాన్ని అందుకోలేని నిరుపేదలంతా నిరక్షరాస్యులు, వృద్ధులు, మహిళలే అధికంగా ఉన్నారు.

***ప్రత్యేక చొరవ లేకుంటే..***

గృహజ్యోతికి చేసుకున్న దరఖాస్తుల్లో అనేక తప్పులుండడం వల్ల అర్హులు వేలాదిగా పథకానికి దూరమయ్యారు. వీటిపై ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్పా వీరందరికీ పరిష్కారం దొరకడం కష్టం. దరఖాస్తులో మీటరు నెంబరు తప్పుగా నమోదై ఉంటే ఆధారాలతో దరఖాస్తు చేస్తే వెంటనే సవరిస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో గృహజ్యోతి పథకం అవసరమని టిక్ కొట్టకపోతే ఆన్‌లైన్‌లో వారి దరఖాస్తు కనిపించడం లేదు. ఇలాంటి మరో రెండు మూడు సమస్యలు గృహజ్యోతికి దరఖాస్తులు చేసుకున్న వాటిలో అనేకం ఉన్నాయి. ఇదిలా ఉంటే, మరికొన్ని దరఖాస్తులు అన్ని కరెక్ట్‌గా నమోదు చేసినా ఆన్‌లైన్‌లో కొత్త సమస్యలు వస్తున్నాయి. ఏమైనా జిల్లాలో ఇంతలా పెండింగ్‌లో ఉన్న గృహజ్యోతి కనెక్షన్లకు పరిష్కారం రావాలంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరం ఉన్నది. లేకుంటే వేలాది మంది అర్హత ఉన్నా.. రాయితీని అందుకోలేకపోవడం ఖాయమన్నట్లు కనిపిస్తున్నది.

### అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం..



ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాం. చాలా మందికి జీరో బిల్లులు వస్తున్నాయి. రెండు నెలలుగా ఈ పథకం అమలు కోసం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి అడుగుతున్నాను.. రసీదు చూయించినా మా దరఖాస్తు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. చివరకు మొన్న మంత్రి జూపల్లి వచ్చినప్పుడు కూడా దరఖాస్తు ఇచ్చాను. ఇంకా ఎవరికి చెప్పాలో.. ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు.

***- వెంకటేశ్వర్‌రెడ్డి, వినియోగదారుడు, వీపనగండ్ల***

### నిరుపేదలకు న్యాయం చేస్తాం..



గృహజ్యోతి పథకానికి అర్హత ఉన్న వారందరికీ న్యాయం చేస్తాం. దరఖాస్తుల్లో తప్పుగా నమోదు చేసుకున్న వారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటాం. ఆయా మున్సిపాలిటీలు, మండల పరిషత్‌ల ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. పూర్తి సమాచారం తీసుకొని జిల్లాలో అర్హత ఉండి పథకాన్ని లబ్ధి పొందని దరఖాస్తుదారులపై ప్రత్యేక చొరవ తీసుకుంటాం. అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 200 యూనిట్లలోపు ఉన్న వారందరికీ న్యాయం జరిగేలా చూస్తాం.

***- శ్రీనివాస్, డీఈ, విద్యుత్ శాఖ, వనపర్తి జిల్లా***

### శంకరసముద్రం
## కుడి కాల్వకు నీటి విడుదల

కొత్తకోట, జూలై 21 : శంకర సముద్రం రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ మోటర్లను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ మోటర్ల ద్వారా కనిమెట్ట, పాలెం గ్రామాల రైతులకు సాగునీరు అందుతుంది. కార్యక్రమంలో ప్రశాంత్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, గుంత రమణ, కరుణాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీటికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

### సెలవు రోజుల్లోనూ
## ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ

- నోటీసులు జారీ చేసిన ఎంఈవో

అయిజ, జూలై 21 : ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రైవేట్ పాఠశాలలు సెలవు రోజుల్లోనూ నిర్వహిస్తున్నారు. సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతోపాటు గురు పౌర్ణమి సెలవు ఉన్నప్పటికీ అయిజ పట్టణంలోని ఠాగూర్, అక్షర, లయోలా, కాకతీయ పాఠశాలలను ఏపీబీవీ విద్యార్థి సంఘం నాయకులు సందర్శించి తరగతుల నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు.

సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తున్న విషయాన్ని ఎంఈవో నర్సింహులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మార్సీ సిబ్బందితో పాఠశాలలను తనిఖీ చేశారు. సెలవు రోజుల్లో పాఠశాలల నిర్వహణ చట్ట విరుద్ధమని, అందుకు ఆయా పాఠశాలలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో నోటీసులు జారీ చేస్తామని ఎంఈవో తెలిపారు. సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించే వాటికి భారీ జరిమానా విధించి మరోసారి తరగతులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు.